# 45

# చతుర బాలుడు

అనగా అనగా ఒక ఊరిలో ఏడుగురు అన్నదమ్ములు వుండేవారు.

వాళ్ళూ, వాళ్ళ భార్యలూ, బిడ్డలూ అందరూ ఎంతో అన్యోన్యంగా ఉండేవారు. ఆ కుటుంబాన్ని చూస్తే అందరికీ చూడముచ్చటగా ఉండేది.

ఆ అన్నదమ్ముల్లో చివరివాని భార్యపేరు రూపవతి. పేరుకి తగ్గట్లు ఆమె ఎంతో అందంగా ఉండేది. పైగా... ఆమె ఎంతో దైవభక్తురాలు. ఆమె దైవభక్తి ఇంటిలో అందర్నీ కాపాడుతుండేది.

ఆమె తొలిసారిగా పురిటి కోసం పుట్టింటికి వెళ్లింది. ఆ అదను చూసుకుని 'కిరి' అనే భూతం ఒకటి బాటసారి రూపంలో వారింటికివెళ్లింది. ఆ అన్నదమ్ములు అతనికి అతిథిమర్యాదలు చేసి ఆ రాత్రికి వారింటిలోనే ఉండి పొమ్మన్నారు. కిరి అందుకు ఒప్పుకుని ఆ రాత్రికి వారింటిలోనే ఉండిపోయింది.

అందరూ నిద్రపోయాక- అది ఆ అన్నదమ్ముల్నీ, వారి భార్యాబిడ్డల్నీ చంపి తినేసింది. ఈ సంగతి తెలిసి రూపవతి భోరున ఏడ్చింది. చేసేదిలేక పుట్టింటిలోనే ఉండిపోయింది.

కిరి ఆ ఇంటిని దెయ్యాల కొంపగా మార్చి అక్కడే తిష్టవేసింది.

కొన్నాళ్ళకి రూపవతికి ఒక కొడుకు పుట్టాడు. వాడికి 'చతురుడు' అని పేరు పెట్టారు. ఆ బాబుని ఎంతో అల్లారు ముద్దుగా పెంచుకోసాగింది రూపవతి.

చతురుడికి పన్నెండేళ్ళు వచ్చాయి. ఒకసారి తోటి పిల్లలతో ఆడుకుంటుండగా కొందరు అల్లరిపిల్లలు చతురుడిని హేళన చేశారు.

అవమానంతో ఇంటికి వచ్చి, తల్లిని అడిగి జరిగినదంతా తెలుసుకున్నాడు.

చతురుడు తిన్నగా కిరి దగ్గరకు వెళ్లాడు. "తాతా... నాకు ఎవ్వరూ లేరు. నీకు సహాయంగాఉంటూ నీ దగ్గరే ఉండిపోతాను" అన్నాడు.



చతురుడు ఎంతో ముద్దుగా ఉన్నాడు. 'వాడు మంచి వయసులోకి వచ్చాక స్వాహా చేయవచ్చులే. అంతవరకు తనకు సహాయంగా ఉంటాడు' అనుకుని అందుకు ఒప్పుకున్నాడు కిరి.

కొద్దిరోజుల్లోనే కిరి అభిమానాన్ని చూరగొన్నాడు చతురుడు.

ఒక రోజున ఆ ఇంట్లో ఓ మూల ఎముకలు, పుర్రెలు గుట్టలుగా ఉండడం చూశాడు చతురుడు. అవేమిటని కిరిని అడిగాడు.

"అవన్నీ ఈ ఇంట్లో వారిని తను చంపి తినగా మిగిలినవి" అని చెప్పాడు కిరి.

అతను రోజూ నరకానికి వెళ్లి యముని దర్శనం చేసుకుని వస్తాడన్న విషయం కూడా తెలుసుకున్నాడు చతురుడు. "ఈ సారి నరకానికి వెళ్లినప్పుడు నా ఆయువు ఎంత ఉందో తెలుసుకుని రమ్మ"ని చెప్పాడు కిరితో.

"నీకు నిండా నూరేళ్లు ఆయువు వుందని యముడు చెప్పాడు" అని చెప్పాడు కిరి.

"నేను ఈ ఇంట్లో ఉంటుండినవారిలో చివరివాని కొడుకుని. మా వాళ్ళని బ్రతికించు కుందామని వచ్చాను" అన్నాడు.

ఆ విషయం తెలియగానే పట్టరాని కోపం వచ్చింది కిరికి.

చతురుని చంపుతానని ముందుకు వచ్చాడు.

చతురుడు "తాతా... నువ్వు ఆ పని చేయలేవు. నాకు నూరేళ్లు వయసుందని ఇప్పుడేగా చెప్పావు. నన్ను చంపాలని చూస్తే యమునికి కోపం వచ్చి నిన్నే చంపుతాడు... జాగ్రత్త!" అని తెలివిగా హెచ్చరించాడు.

ఆ మాటలు సబబుగా అనిపించాయి కిరికి.

వెంటనే తాను చంపిన ఆ ఇంటి వారందరినీ తిరిగి బ్రతికించి తాను మరో చోటికి వెళ్లిపోయాడు.

చతురుడు తన తల్లిని పిలిపించి ఇంటి వారందరితోనూ సుఖంగా ఉండసాగాడు.

★★★

